సాక్షి ప్రకాశం

గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



దౌర్జన్యాలకు పాల్పడిన వారిపై కేసులు

టీడీపీ ఇచ్చిన పిలుపు మేరకు ఒంగోలులో బంద్ నిర్వహించి దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడిన పలువురిపై కేసులు నమోదయ్యాయి. - 8లో..



మంచి జరిగితేనే ఆదరించండి

మీ కుటుంబంలో మంచి జరిగితేనే ప్రభుత్వాన్ని ఆదరించండి అని చెప్పగలిగే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని వరికూటి అశోక్‌బాబు అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
35/28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్టేట్ ఐటీ వింగ్ కోఆర్డినేటర్‌గా రోశిరెడ్డి



రోశిరెడ్డి (ఫైల్)

పొదిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఐటీ వింగ్ కోఆర్డినేటర్‌గా శింగారెడ్డి రోశిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. కొనకనమిట్ల మండలం మర్రిపాలెం గ్రామానికి చెందిన శింగారెడ్డి రోశిరెడ్డి ఉన్నత విద్యావంతుడు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్న రోశిరెడ్డికి వైఎస్సార్ కుటుంబం అంటే ఎనలేని అభిమానం. ఆ అభిమానంతోనే పార్టీకి ఐటీ తరఫున సేవలు అందిస్తున్నాడు. వైఎస్ కుటుంబ అభిమానులు, పార్టీ కార్యకర్తల్లో ఇంజినీరింగ్ చేసిన వారిని చేరదీసి వారికి ఉద్యోగ అవకాశాలు చూపించటం, వారి బాగోగులు చూడటం చేస్తుంటాడు. ఈ సందర్భంగా రోశిరెడ్డి మాట్లాడుతూ తనకు వచ్చిన ఈ అవకాశం ద్వారా పార్టీకి మరింతగా సేవలు అందిస్తానని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, విజయసాయిరెడ్డికి, పదవి వచ్చేందుకు సహకరించిన మార్కాపురం ఎమ్మెల్యే కేపీ.నాగార్జున రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ షాపులు తనిఖీ చేసిన కేంద్ర బృందం



రేషన్ షాపులు తనిఖీ చేస్తున్న కేంద్ర బృందం

ఒంగోలు అర్బన్: ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం బుధవారం జిల్లా కేంద్రం ఒంగోలులో 2 రేషన్ షాపులు తనిఖీ చేశారు. దీంతోపాటు మద్దిపాడులో 2, టంగుటూరు ఒక షాపును తనిఖీ చేశారు. కార్డుదారులతో పంపిణీ విధానంపై ఆరా తీశారు. అనంతరం ఫ్లోరిఫైడ్ బియ్యం ఉపయోగాలను వినియోగదారులకు వివరించారు. దీనిలో డీఎస్ఓ ఉదయ్‌భాస్కర్, ఒంగోలు, సింగరాయకొండ, దొనకొండ, పొదిలి, యర్రగొండపాలెం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, సీహెచ్ కృష్ణమోహన్, ఎస్.రామనారాయణరెడ్డి, కే డేవిడ్‌రాజు, ఎస్‌కే ముస్తాక్, ఒంగోలు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పూతకోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సచివాలయాల అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా కసిరెడ్డి



కసిరెడ్డి వెంగల్‌రెడ్డి (ఫైల్)

చీమకుర్తి: గ్రామ, వార్డు సచివాలయాల అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా చీమకుర్తి గాంధీనగర్ సచివాలయం అడ్మిన్ కసిరెడ్డి వెంగల్‌రెడ్డిని నియమించినట్లు ఆయన బుధవారం చీమకుర్తిలో తెలిపారు. గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్, సచివాలయాల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి ఈ కమిటీని ప్రకటించినట్లు తెలిపారు. వెంగల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... సచివాలయాల అసోసియేషన్‌కు అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.ప్రభాకర్‌రావు (ఒంగోలు), జనరల్ సెక్రటరీగా జీ.గురవయ్య (కేకే మిట్ల), వైస్ ప్రెసిడెంట్‌లుగా జి.సుబ్బారావు (పొదిలి), శ్రీనివాసరెడ్డి (మార్కాపురం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా సతీష్ (కనిగిరి), కోశాధికారిగా ఏడుకొండలరెడ్డి (చీమకుర్తి), ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కోటేశ్వరమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెంగల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం సభ్యులు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సీఎం జగన్‌కు ఏపీపీటీడీ ఉద్యోగుల కృతజ్ఞతలు



సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యులు

ఒంగోలు సిటీ: ఏపీపీటీడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం జీఓ నంబరు 96 ను విడుదల చేయడమే కాక, ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్‌కు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిన సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఒంగోలు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గేట్ మీటింగ్ నిర్వహించి తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ వైఎస్ ప్రసాద్, జిల్లా చైర్మన్ బొబ్బా శివాజీ, జిల్లా కార్యదర్శి ఎస్.ప్రసాద రావు, జిల్లా అధ్యక్షుడు ఆర్.అంజయ్య, డిపో సెక్రటరీ ఎన్.వి.ఎస్.కుమార్, సాయి, రమేష్ పాల్గొన్నారు.

సంక్షేమం.. పండగే..

అర్హతే ప్రామాణికం..అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్న మహోత్తర లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నవరత్నాల పేరుతో ప్రభుత్వం నాలుగేళ్లుగా ఇంటిముంగిటకే సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తోంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇప్పటి వరకు సాంకేతిక సమస్యలతో సంక్షేమ పథకం రాని వారిని గుర్తించి మరీ ప్రభుత్వం అందిస్తోంది. తాజాగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటినీ జల్లెడ పట్టారు. అర్హతలున్నా చిన్న, చిన్న కారణాలతో ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించింది. దీంతో జిల్లాలో రూ.4.62 కోట్లతో కొత్తగా 16,452 మందికి పింఛన్లు అందిస్తోంది.

- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం
- ఆపన్నులను ఆదుకోవడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యం
- జిల్లాలో కొత్తగా 16,452 పెన్షన్లు
- నూతనంగా ఎంపికైన పెన్షన్‌దారులకు రూ.4.62 కోట్లు అందిస్తున్న వైనం
- జిల్లా వ్యాప్తంగా కొత్తవాటితో కలుపుకొని మొత్తం 2,95,860 పెన్షన్‌దారులు
- జిల్లాలో ఇక నుంచి ప్రతి నెలా రూ.82.26 కోట్లు అందజేత



నూతన పెన్షన్‌ను గిద్దలూరు మండలం దిగువమెట్ట తండాలో బుధవారం పంపిణీ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్, సిబ్బంది

సాక్షిప్రతినిధి, ఒంగోలు: సంక్షేమం ఒక ఉద్యమంలా సాగాలి...అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు తప్పనిసరిగా అందాలి. అర్హత ఉన్న ఏ వ్యక్తి కూడా తనకు ప్రభుత్వం అందించే ఏ ఒక్క పథకం రాలేదు అనకూడదు.. అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యాక్రమం ఇంటింటికీ వెళ్లి అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారి గుర్తించారు. జిల్లాలో సురక్ష కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో అమలు చేశారు. వలంటీర్లతో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సభలు నిర్వహించి అక్కడికక్కడే అవసరమై ధ్రువ పత్రాలను అందజేశారు. ఇది సత్ఫలితాలనిచ్చింది. జిల్లా వ్యాప్తంగా పెన్షన్‌లకు అర్హులైన వారిని గుర్తించారు. జిల్లాలో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులతో పాటు వివిధ చేతివృత్తిదారులను గుర్తించారు. తొలి విడతలో 7,500 మందిని, రెండో విడతలో ఈనెల 12వ తేదీలోపు 8,952 మందిని గుర్తించారు. రెండు విడతల్లో మొత్తం కలుపుకొని 16,452 మందికి నూతనంగా పెన్షన్‌లను అందించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. నూతనంగా మంజూరు చేసిన పెన్షన్లకుగాను రూ.4,62,01,000 అందించనున్నారు. నూతనంగా మంజూరైన పెన్షన్‌లను ఈ నెల 14వ తేదీలోగా అందించేలా కార్యాచరణను చేపట్టారు. కొత్తవాటితో కలుపుకుని మొత్తం జిల్లా వ్యాప్తంగా 2,95,860 మందికి ఇక నుంచి ప్రతినెలా ఒకటో తేదీ నాడే పింఛన్ డబ్బులు అందించనున్నారు. ఇకనుంచి ప్రతి నెలా ఒకటో తేదీన జిల్లా వ్యాప్తంగా రూ.82.26 కోట్లు ఇవ్వనున్నారు.

నూతన పెన్షన్లు ఇలా..

పెన్షన్ స్కీం పేరు	పెన్షన్ల సంఖ్య	మొత్తం రూ.
అభయ హస్తం	20	10,000
సీకేడీయూ..ప్రభుత్వం	10	1,00,000
సీకేడీయూ...ప్రైవేటు	27	2,70,000
డప్పు కళాకారులు	648	19,44,000
డిజేబుల్డ్	2181	65,43,000
డీఎంహెచ్ఓ	12	60,000
ఫిషర్‌మెన్	130	3,57,500
ఓ ఏ పీ	7831	2,15,35,250
ఒంటరి మహిళ	67	1,84,250
కళ్ళుగీత కార్మికులు	09	24,750
ట్రెడిషనల్ కోబ్లర్స్	790	21,72,500
ట్రాన్స్ జెండర్స్	02	6000
వీవర్స్	33	90,750
వితంతువులు	4692	1,29,03,000
మొత్తం	16452	4,62,01,000



పింఛన్ నగదుతో ఒంగోలు మంగమూరు డొంక ఆశ్రమం సమీపంలో నివాసం ఉంటున్న వృద్ధురాలు పి.సుబ్బాయమ్మ (ఫైల్)

నేటి సాయంత్రం లోపు అందరికీ పంపిణీ



నూతనంగా మంజూరైన పెన్షన్‌లను గురువారం సాయంత్రం లోగా ప్రతి లబ్ధిదారునికి పంపిణీ చేసేలా ఏర్పాటు చేశాం. జిల్లాలో నూతనంగా 16,452 పెన్షన్లు మంజూరయ్యాయి. అందుకుగాను ప్రతి నెలా ప్రభుత్వంపై అదనంగా జిల్లాలో రూ.4,62,01,000 భారం పడనుంది. అందుకోసం జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని సచివాలయాల బ్యాంకు అకౌంట్లకు నగదు జమ చేశాం. ఆ నగదును సచివాలయ సిబ్బంది డ్రా చేసి వలంటీర్ల ద్వారా పెన్షన్‌దారులకు పంపిణీ చేస్తారు.

– తేళ్ల రవికుమార్, పీడీ, డీఆర్‌డీఏ

నేడు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని చేతుల మీదుగా..



నూతనంగా మంజూరైన పెన్షన్‌లను మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి చేతుల మీదుగా గురువారం పంపిణీ కార్యక్రమం చేపట్టాం. ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు పంపిణీ చేపట్టనున్నాం. ఒంగోలు నగరంలో నూతనంగా మొత్తం 1125 పెన్షన్లు మంజూరయ్యాయి. నూతనంగా మంజూరైన పెన్షన్లను పంపిణీ చేయటాన్ని ఒక వేడుకలా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుంది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేశాం. ఇంకా ఎవరికైనా కొన్ని సాంకేతికపరమైన సమస్యలుంటే వాటిని కూడా పరిష్కరించి అర్హత ఉంటే చాలు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాన్ని అందించాలని ఎమ్మెల్యే పదేపదే అధికారులను ఆదేశిస్తున్నారు.

– ఎం.వెంకటేశ్వరరావు, కమిషనర్, ఒంగోలు నగర పాలక సంస్థ

గడువులోగా ఆడిట్ రిపోర్టులు సమర్పించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆదాయపుపన్ను అధికారి కిషోర్‌కుమార్

ఒంగోలు టౌన్: స్వచ్ఛంద సంస్థలు సమర్పించే ఐటీఆర్ 7, ఆడిట్ రిపోర్టులను గడువులోగా సమర్పించాలని చార్టర్డ్ అకౌంటెంట్ చక్కా తిరువాయి తెలిపారు. బుధవారం ట్రంకు రోడ్డులోని ఆదాయ పన్ను కార్యాలయంలో ఆదాయపు పన్ను చట్టాలు, నూతన సవరణలు, మినహాయింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. హైదరాబాద్, విజయవాడలకు చెందిన సంయుక్త సంచాలకులు బి.బాలకృష్ణ, కోటేశ్వరమ్మ ఆదేశాల మేరకు ఆదాయపు పన్ను అధికారి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన సదస్సులో స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలకు వర్తించే మినహాయింపులు, ఆదాయపుపన్ను రిటర్న్, ఐటీఆర్ 7, ఫారం 10,10ఏ, 10బీ, గడువు తేదీల గురించి వివరించారు. సదస్సులో ఒంగోలు ఆదాయపన్ను శాఖాధికారి మేకల దాసు, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ, ఐసీఏఐ రమణయ్య, ఒంగోలు చాప్టర్ చైర్మన్ ఎన్‌బీ చైతన్యారెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రేమ్ కుమార్, కార్యదర్శి కోణిజేటి కృష్ణ కిషోర్, సీనియర్ సభ్యులు రంగనాథం, జగన్మోహన్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో కాంస్య పతకం

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు కే సిద్ధార్థ, డీ అవినాష్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు హర్యానాలోని రోతక్ ఇండోర్ స్టేడియంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని డి.అవినాష్ కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొనటానికి సహాయ సహకారాలు అందించిన ఎం.వెంకట్రావు, కేవీపాలెం కె.వెంకట్రావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పీడీ తుల్లిబిల్లి అశోక్‌బాబు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



కాంస్య పతకంతో అవినాష్

ఏపీయూఎస్‌కి ఈహెచ్‌ఎస్ స్టీరింగ్ కమిటీలో చోటుపై హర్షం

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్)ను ఈహెచ్‌ఎస్ స్టీరింగ్ కమిటీలో చేరుస్తూ జనరల్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్టుమెంట్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీఓ ఆర్టీ నంబరు 1805, 1806 ల ద్వారా ఉత్తర్వులు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఏపీయూఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.మల్లికార్జునరావు, దిలీప్ చక్రవర్తులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు ఈహెచ్‌ఎస్ ట్రస్ట్ ద్వారా మరింత సర్వీసును అందేటట్లు చేయడంలో రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.శ్రావణ్‌కుమార్ కృషి చేయడానికి అవకాశం కల్పించినట్లయిందని వారు తెలిపారు.

తొలగించిన ఓట్ల పరిశీలన సగం పూర్తి



గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: 2021వ సంవత్సరంలో తొలగించిన 64 వేల ఓట్ల పరిశీలన ప్రక్రియ ఇప్పటికి సగం పూర్తయిందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై బుధవారం ప్రకాశం భవనంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ తొలగించిన ఓట్ల పరిశీలన మరో మూడు రోజుల్లో పూర్తి చేసి సీఈఓకు నివేదిక పంపుతామన్నారు. రాజకీయ పార్టీలు కూడా బీఎల్ఏలను నియమించుకుని ఈ ప్రక్రియలో బీఎల్ఓలకు సహకరించాలని సూచించారు. జిల్లాలో ఫారం 6, 6–బి, 8ల పరిశీలన జరుగుతున్న తీరు, డోర్ నంబర్ల పరిశీలన వివరాలను వివరించారు.

దీనిలో డీఆర్ఓ శ్రీలత, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల నాయకులు కాలేషాబేగ్, రాజశేఖర్, సత్యం, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే ‘జగనన్నకు చెబుదాం’

- కలెక్టర్ దినేష్ కుమార్, ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి మండలంలో ‘జగనన్నకు చెబుదాం’ పేరుతో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దినేష్ కుమార్, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. స్థానిక చీతిరాల వెంకటేశ్వర్లు కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు హాజరై ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి యంత్రాంగం అంతా క్షేత్ర స్థాయికే వస్తుందని, సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో 408 అర్జీలు రాగా ప్రతి అర్జీని సహేతుకంగా, సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతంలోని గిద్దలూరు మండలంలో ఈ కార్యక్రమాన్ని ముందుగా నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్ దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్తే పరిష్కారం అవుతాయన్న విశ్వాసంతో ప్రజలు వచ్చారని, అర్జీదారులు సంతృప్తి చెందేలా అధికార యంత్రాంగం వీటిని పరిష్కరించేలా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి రామసుబ్బయ్య, డీఆర్వో శ్రీలత, తహసీల్దార్ సీతారామయ్య, కమిషనర్ రామకృష్ణ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యానికి భద్రత

- కలెక్టర్ దినేష్ కుమార్
- ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు
- గిద్దలూరులో సీఎం టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే



టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే

గిద్దలూరు రూరల్: ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించి వారి పరిస్థితిని నిరంతరం సమగ్రంగా పర్యవేక్షించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం మొదలు పెట్టిందని కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ అన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబుతో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సీఎం వీడియో కాన్ఫరెన్స్ లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ద్వారా ఇప్పటికే క్షేత్రస్థాయిలోనే ప్రజలకు వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం వీటిని మరింత విస్తృత పరిచేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రూపకల్పన చేసిందన్నారు. ఇందులో భాగంగా వలంటీర్ల సహకారంతో ఏఎన్ఎంల ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలందరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనారోగ్యంతో ఉన్న ప్రజలను గుర్తించి సంబంధిత వివరాలతో ప్రత్యేకంగా కేస్‌షీట్లు తయారు చేస్తారన్నారు. బీపీ, షుగరు, రక్తం, కఫం, మూత్రం తదితర ఏడు రకాల పరీక్షలను ఇంటి వద్దే నిర్వహిస్తారని తెలిపారు. ఈనెల 30వ తేదీ నుంచి అక్టోబరు 30వ తేదీ వరకు ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఆరోగ్య సర్వే, వైద్య శిబిరాల నిర్వహణ విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో 1100గా ఉన్న ఆరోగ్యశ్రీ సేవలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 3200లకు పైగా పెంచారన్నారు. ఈ నాలుగేళ్ల కాలంలో రాష్ట్రంలో 60 వేల మంది డాక్టర్లను, వైద్య సిబ్బందిని భర్తీ చేసి వైద్య రంగాన్ని బలోపేతం చేశారని చెప్పారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నుంచి బోధనాస్పత్రుల వరకు నాడు–నేడు పథకంలో అవసరమైన నిర్మాణ పనులను చేపట్టి మౌలిక వసతులను పెంచినట్లు వివరించారు. నాణ్యతలో రాజీపడకుండా మంచి ఔషధాలను రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. క్షయరోగులకు పోషకాహారం అందిస్తున్న పలువురు స్థానికులను ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే అభినందించి ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి రాజ్యలక్ష్మి ఐసీడీఎస్ పీడీ మాధురి, డీఈఓ వీ సుబ్బారావు, జెడ్పీ సీఈఓ జాలి రెడ్డి, డీఐఓ పద్మజ, డీసీహెచ్ఎస్ మూర్తి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ శ్రావణ్ కుమార్, జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి సురేష్ కుమార్, మున్సిపల్ చైర్మన్ పి.వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్ ఆర్‌డీ రామక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ రామక్రిష్ణయ్య, మెడికల్ ఆఫీసర్లు నాయబ్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. ‘అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా’ అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చే వారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

సాయిబాబా సెంట్రల్ స్కూల్,
సాయిబాబా నగర్, పెళ్లూరు,
ఒంగోలు కార్పొరేషన్,
క్విస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్,
పొందూరు రోడ్డు, వెంగముక్కపాలెం,
ఒంగోలు కార్పొరేషన్


తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 9010357744



ఒంగోలులో వినాయకుడి విగ్రహాలను ఎంపిక చేసుకుంటున్న యువకులు



హాయ్.. హాయ్ గణేశా..



వినాయక చవితి పర్వదినానికి గణనాథుడి విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. కళ్లు జిగేల్‌మనే రంగులతో ముచ్చటగొలిపేలా ఉన్న లంబోదరుడి ప్రతిమల్లో ఏది ఎంపిక చేసుకోవాలో తెలియక యువత తికమకపడుతున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో బొజ్జ గణపయ్య విగ్రహాలను మండపాల్లో కొలువుదీర్చారు. ఈ ఏడాది విగ్రహాల విక్రయాలు ఆశాజనకంగా ఉంటాయని కళాకారులు భావిస్తున్నారు. - సాక్షి, ఒంగోలు





విక్రయానికి సిద్ధంగా గణనాథుడి విగ్రహాలు





విగ్రహాలను తిలకిస్తున్న విద్యార్థులు



గణనాథుడికి తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారులు

మంచి జరిగితేనే ఆదరించండి

- వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- 229 రోజుల్లో 90 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి



జమ్ములపాలెంలో మాట్లాడుతున్న వరికూటి అశోక్ బాబు

టంగుటూరు: మీ ఇంట్లో మంచి జరిగితేనే ప్రభుత్వాన్ని ఆదరించండి అని గర్వంగా చెప్పుకునే ముఖ్యమంత్రి దేశం మొత్తం మీద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. బుధవారం టంగుటూరు మండలంలోని జమ్ములపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగింపు సందర్భంగా వరికూటి విలేకర్లతో మాట్లాడారు. దాదాపు 16 నెలలుగా నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించామన్నారు. మొత్తం 229 రోజుల్లో 90 సచివాలయాల పరిధిలోని 1,03,616 గడపలను సందర్శించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించామన్నారు. ప్రజా సమస్యలను అధికారుల సమక్షంలో పరిష్కరించామని చెప్పారు. ప్రతి సచివాలయం పరిధిలో కార్యక్రమం పూర్తయిన వెంటనే అభివృద్ధి పనుల నిర్వహణకు ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో రూ.18 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వరికూటి వివరించారు. స్కిల్ స్కామ్‌లో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని స్వాహా చేసి అడ్డంగా దొరికిన చంద్రబాబును అరెస్టు చేసి జైలుకు పంపిస్తే ఏదో అన్యాయం జరిగిపోయిందన్నట్లు టీడీపీ నేతలు, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, పచ్చ మీడియా రాద్ధాంతం చేస్తున్నాయన్నాయని విమర్శించారు. అనారోగ్యంతో వృద్ధులు మరణిస్తే చంద్రబాబుపై అభిమానంతో చనిపోయారని పచ్చ పత్రికలు కలరింగ్ ఇవ్వడాన్ని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మొత్తం 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు వరికూటిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, సొసైటి అధ్యక్షుల్యు రావూరి ప్రవీణ్‌కుమార్, కొండపి ఏఎంసీ డైరెక్టర్లు కొమ్ము సురేంద్ర, టంగుటూరి రామకృష్ణ, వాకా బాలకృష్ణారెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు మల్లవరపు రాఘవరెడ్డి, శారీమందిర్ వెంకటేశ్వర్లు, అనంతవరం సర్పంచి ఉప్పలపాటి శివరామరాజు, సొసైటి డైరెక్టర్ ఉప్పలపాటి నాగరాజు, ఉప్పలపాటి సుబ్బరాజు, జకా రాజేశ్వరరావు, పలువురు నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

17న జిల్లా స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

ఒంగోలు సిటీ: జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక మినీస్టేడియంలో సీనియర్ పురుషులు, స్త్రీల జట్లను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి బొడ్డు సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలను కమిటీ సభ్యులు జిల్లా సాఫ్ట్‌బాల్ కోచ్ టి.త్రినాథ్ బాబు, కె.ప్రేమ్‌కుమార్ పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. ఎంపికైన జిల్లా జట్లు అక్టోబర్ మొదటి వారంలో ఏలూరులో నిర్వహించనున్న 9వ సీనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్ కార్డు, 4 పాస్‌పోర్టు ఫొటోలను 17వ తేదీన మినీస్టేడియంలో పీఎల్ రాజుకు అందజేయాలని సూచించారు. వివరాలకు 99493 46536, 93984 79248ను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

గుండ్లకమ్మ బ్రిడ్జి కింద గుర్తుతెలియని మృతదేహం



ఒంగోలు టౌన్: మండలంలోని కరవది–అమ్మనబ్రోలు మధ్యలో గుండ్లకమ్మ బ్రిడ్జి కింద బుధవారం సాయంత్రం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి సుమారు 35 ఏళ్ల వయసు ఉంటుందని, నల్లచొక్కా మీద తెల్ల అడ్డగీతలు కలిగిన ఫుల్ షర్ట్, నల్ల జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడని చెప్పారు. అంతకుమించి మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఒంగోలు జీఆర్పీ ఏఎస్సై ఎ.నరసింహరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9490566577, 9494684304ను సంప్రదించాలని ఏఎస్సై సూచించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



బోళ్ల సుబ్బులు(ఫైల్)

గంగపాలెం (మద్దిపూడి): పెంకుటింటిపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడిన మహిళ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు మేరకు... మండలంలోని గంగపాలెం గ్రామానికి చెందిన బోళ్ల సుబ్బులు (66) వారం రోజుల క్రితం వేప ఆకులు చిమ్మేందుకు మంచం సహాయంతో ఇల్లు ఎక్కింది. ఈ క్రమంలో జారి పడటంతో గాయాలపాలైన సుబ్బులును బంధువులు మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుబ్బులు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ శివబసవరాజు తెలిపారు. కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు.

ఏకేయూలో పీజీ అడ్మిషన్లు ప్రారంభం

ఒంగోలు సిటీ: ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు డైరెక్టర్ డాక్టరు జి.సోమశేఖర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐసెట్ ద్వారా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశానికి ఈ నెల 8 నుంచి విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు సర్టిఫికెట్లు పరిశీలిస్తామన్నారు. 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ నమోదు అనంతరం 25న సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. అలాగే ఏపీ పీజీ సెట్ ద్వారా ఆర్ట్స్ విభాగంలో ఎంఏ ఎకనామిక్స్, హిస్టరీ, సోషల్ వర్క్, ఇంగ్లిష్, తెలుగు, ఎంఎడ్, ఎంకామ్, ఎంపీఎడ్, అలాగే సైన్స్ విభాగంలో ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఆక్వాకల్చర్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలైటికల్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందని, ఈ నెల 20వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతుందని తెలిపారు. వివరాలకు 99490 88109, 89784 96178ను సంప్రదించాలని సూచించారు.

దౌర్జన్యానికి పాల్పడిన టీడీపీ నాయకులపై కేసుల నమోదు

ఒంగోలు టౌన్: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో వందల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన కేసులో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ప్రధాన నిందితుడు మాజీ ముఖ్యమంతి చంద్రబాబుకు మద్దతుగా టీడీపీ ఇచ్చిన పిలుపు మేరకు ఒంగోలు నగరంలో బంద్ నిర్వహించి దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడిన పలువురు నాయకులు, కార్యకర్తలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించడమే కాకుండా ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించిన మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తోపాటు మరో 42 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ట్రంకు రోడ్డు నుంచి ర్యాలీగా బయలుదేరిన తెలుగుదేశం నాయకులు ప్రశాంతంగా వ్యాపారాలు నిర్వహించుకుంటున్న దుకాణాలను బలవంతంగా మూయించారు. పోలీసులను దూషించడమే కాకుండా అధికారులను నెట్టివేయడంలాంటి చర్యలకు పాల్పడ్డారు. కొందరు పోలీసులను దారి పక్కన ఉన్న కాలువల్లోకి నెట్టివేశారు. ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. నగరంలో శాంతి భద్రతలను దెబ్బతీయాలని ఉద్దేశపూర్వకంగా రచ్చకు దిగారు.



ఇనయతుల్లా మీద దాడికి పాల్పడుతున్న టీడీపీ కార్యకర్తలు

30 పోలీసు యాక్టు అమలులో ఉన్నప్పటికీ ఖాతరు చేయకుండా ఇష్టారీతిగా ప్రవర్తించారు. ఈ నేపథ్యంలో దామచర్లతో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ తదితరులపై కేసులు నమోదు చేశారు. ఇంకా సాక్షులను విచారిస్తున్నామని, దర్యాప్తు అనంతరం సాక్ష్యాలను బట్టి మరికొంత మంది కార్యకర్తలపై కూడా కేసులు నమోదు చేసే అవకాశం ఉందని డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురికి రిమాండ్

నగరంలోని దోవలపాలేనికి చెందిన షేక్ ఇనాయతుల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల కార్యకర్త. అతడు వెల్డింగ్ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ విషయం తెలిసిన టీడీపీ కార్యకర్తలు కొందరు ఉద్దేశపూర్వకంగా అతడి దుకాణం వద్దకు వచ్చి ఇనయతుల్లా మీద దాడికి పాల్పడ్డారు. కాళ్లు చేతులతో కొట్టి అతడికి ఊపిరాడకుండా చేసేందుకు దుకాణంలో ఉంచి బయటి నుంచి షట్టర్ వేశారు. బాధితుడు ఇనాయతుల్లా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీసీ ఫుటేజీని పరిశీలించి నిందితులను గుర్తించిన పోలీసులు మేడికొండ మోహనరావు, బత్తినబోయిన సత్యనారాయణ, మందపాటి రంగారావు, కొల్లా వెంకటరావు, పవన్ కుమార్‌ను అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపరి చారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నిందితులకు జుడీషియల్ రిమాండ్ విధించినట్లు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి తెలిపారు. ఇదే కేసులో మరికొందరు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని డీఎస్పీ చెప్పారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్-2023 బ్రోచర్ ఆవిష్కరణ



ఆర్ట్ ఫెస్ట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాశ్‌బాబు తదితరులు

ఒంగోలు మెట్రో: సృష్టి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అక్టోబర్‌లో నిర్వహించనున్న ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్-2023 బ్రోచర్‌ను ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.ప్రకాశ్‌బాబు, సృష్టి ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ తిమ్మిరి రవీంద్ర, క్లాడ్ టిమొన్ డైరెక్టర్ తోటపల్లి బిల్లీ గ్రాహం, నేషనల్ హ్యూమన్ రైట్ జిల్లా అధ్యక్షుడు పరుచూరి ఆనంద్ ఆవిష్కరించారు. ఆర్ట్ ఫెస్ట్‌లో మోస్ట్ సెల్ఫ్ పోర్ట్రెయిట్ పెయింటింగ్ వర్క్‌షాప్ ఫర్ వరల్డ్ రికార్డు, బ్రహ్మం కళా యజ్ఞ ఆర్ట్ ఎగ్జిబిషన్, బాలల చిత్ర కళా ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. గురువారం నుంచి అక్టోబర్ 10వ తేదీలోగా గూగుల్ లింక్ ద్వారా దరఖాస్తు చేసుకున్న చిత్రకారులకు మాత్రమే ఫెస్ట్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందని అకాడమీ అధ్యక్షుడు స్పష్టం చేశారు. వివరాలకు 8297090007ను సంప్రదించాలని కోరారు.

పీడీసీసీబీలో 26 మందికి అసిస్టెంట్ మేనేజర్లుగా పదోన్నతి

- నియామక పత్రాలు అందజేసిన పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సబర్బన్: పీడీసీసీ బ్యాంకులో స్టాఫ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న 26 మందికి అసిస్టెంట్ మేనేజర్లుగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు ఒంగోలులోని పీడీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి పదోన్నతి పొందిన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ మాట్లాడుతూ.. స్టాఫ్ అసిస్టెంట్లను అసిస్టెంట్ మేనేజర్లుగా మెరిట్ కం సీనియారిటీ పద్ధతిలో ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.



పీడీసీసీబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న అసిస్టెంట్ మేనేజర్లు

పదోన్నతి పొందిన వారు బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీకాంత్

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

మద్దిపాడు: విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన బత్తుల ఉపేంద్ర (45) గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లోని వంశీ ఎక్స్‌పోర్ట్స్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి పని ముగిసిన తర్వాత రూంకు వెళ్లి చూడగా కరెంట్ లేకపోవడంతో బోర్డును పరిశీలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం కంపెనీ యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించింది. ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలానికి వెళ్లి విచారణ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతుని బంధువులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

కంభం: మతిస్థిమితం లేని బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పులి రాజేష్ బుధవారం రాత్రి తెలిపారు. మంగళవారం కంభం మండలం జంగంగుంట్ల గ్రామంలో బహిర్భూమికి వెళ్లిన మతిస్థిమితం లేని ఓ బాలికను అదే గ్రామానికి చెందిన లక్ష్మయ్య అనే వ్యక్తి లైంగిక దాడి చేశాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి కేసు దర్యాప్తు చేశారు. నిందితుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. త్వరితగతిన చార్జిషీట్ వేసి నిందితుడికి శిక్ష పడేలా చేస్తామని బాధితురాలి తల్లిదండ్రులకు పోలీసులు భరోసా ఇచ్చారు.

రైల్వే ఆస్తులను పరిరక్షించాలి

- సిబ్బందికి ఆర్పీఎఫ్ డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ సూచన



రైల్వే ఆస్తులను పరిశీలిస్తున్న డీఎస్‌సీ సత్యహరప్రసాద్

దొనకొండ: రైల్వే సంస్థ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని గుంటూరు ఆర్పీఎఫ్ డివిజన్ సెక్యూరిటీ కమిషనర్(డీఎస్‌సీ) సత్యహరప్రసాద్ పేర్కొన్నారు. దర్శి పట్టణంలోని ఒక దుకాణంలో దాచిన రూ.83 లక్షల విలువైన రైల్వే కేబుల్ వైర్లను ఆర్పీఎఫ్ డీఎస్‌సీ ఆదేశాల మేరకు ఈ నెల ఒకటో తేదీన సీజ్ చేశారు. ఈ ఘటనలో బాధ్యులైన ఐదుగురిని ఇప్పటికే అరెస్టుకు చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఈ విషయమై ఆర్పీఎఫ్ సిబ్బందికి సలహాలు, సూచనలు ఇవ్వడానికి బుధవారం డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ దొనకొండ ఆర్‌పీఎఫ్ స్టేషన్‌కు వచ్చారు. రైల్వే ఆస్తుల వివరాలు తెలుసుకుని, సంరక్షించేందుకు తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ప్రయాణికుల సామగ్రికి వారే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో రైళ్లల్లో దొంగతనాలు జరగకుండా జాగ్రత్త తీసుకోవాలని తెలియజేశారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మొబైల్ ఫోన్ల చోరీలు జరుగుతున్నాయని, రైల్వే విద్యుత్ విభాగం వారు ముఖ్యమైన స్టేషన్లలో రాత్రి సమయంలో 10 గంటల నుంచి 6 గంటల వరకు చార్జింగ్ పాయింట్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్‌పీఎఫ్ ఏఎస్సై క్రాంతికుమార్, సిబ్బంది శ్రీనివాస్, కోటిరెడ్డి ఉన్నారు.